
సాక్షి
నంద్యాల
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023




శ్రీ మఠంలో డీఐజీ

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. పీఠాధిపతి ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.



మండు వేసవిలోనూ జలకళ

హొళగుంద: మండు వేసవిలోనూ తుంగభద్ర దిగువ కాలువ గలగలా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. పంటలు కోత దశకు చేరుకోవడంలో నీటికి డిమాండ్ తగ్గి కాలువ నిండుగా పారుతోంది.



మహానందిలో సందడి

మహానంది: మహానంది ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కోనేరుల్లో పుణ్య స్నానాలాచరించిన భక్తులు శ్రీకామేశ్వరిదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:43
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:46
నంద్యాల	సా॥ 6:37	ఉ॥ 4:46
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:40
బనగానపల్లె	సా॥ 6:40	ఉ॥ 4:40

హదీస్ వెలుగు :

మొరపెట్టుకునే వారు ఉన్నారా? వేడుకునే వారు ఉన్నారా? వారి మొర విని తీరుస్తాను అని అల్లాహ్ రంజాన్‌లో ప్రతిరోజూ మూడు సార్లు అడుగుతాడు. తరచూ అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. - పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

రేపు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈ ఏడాది భారీగా మట్టి పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): భూసార పరీక్షలు ఈ ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ మార్గదర్శకాలు జారీ చేశారు. భూసార పరీక్షలపై అవగాహన పెంచేందుకు ఈ నెల 12న జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 16లోపు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ జిల్లా, మండల స్థాయిలో వర్క్‌షాపులు ఏర్పాటు చేయనున్నారు. వర్క్‌షాపుల నేపథ్యంలో పెద్ద ఎత్తున మట్టి నమూనాలు సేకరిస్తారు. నమూనాలను కర్నూలు జిల్లాకు సంబంధించి ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రం, నంద్యాల జిల్లాకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రంలో విశ్లేషిస్తారు.

క్వింటా మిర్చి రూ.21,505

- కర్నూలు మార్కెట్‌లో పడిపోతున్న ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర క్రమంగా పడిపోతుంది. ఈ ఏడాది కర్నూలు మార్కెట్‌లో గుంటూరు యార్డుతో సమానంగా మిర్చికి గరిష్ట ధర లభించింది. దీంతో రైతుల తాకిడి కూడా ఎక్కువైంది. అయితే ఉన్నట్టుండి ధర పడిపోవడం రైతులను నిరాశకు గురిచేస్తోంది. ఒకదశలో క్వింటా మిర్చి ధర రూ.50వేలు దాటి పోయింది. ప్రస్తుతం 50 శాతం కూడా పలకకపోవడానికి వ్యాపారులు సిండికేట్ కావడమే కారణం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్కెట్‌కు 388 మంది 1,665 సంచుల మిర్చి తీసుకురాగా.. కనిష్టంగా రూ.5,699, గరిష్టంగా రూ.21,505 ధర మాత్రమే లభించింది. మోడల్ ధర రూ.17,109 నమోదైంది. మిర్చి రైతులు నష్టపోకుండా మార్కెట్ కమిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

'నవోదయ' విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన

ఎమ్మిగనూరురూరల్: నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు కొత్తగా డిజిటల్ విద్యా బోధన అందిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ సాగరిక తెలిపారు. శనివారం బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పీటీసీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులకు టాబ్స్ ఇచ్చామన్నారు. వీటిలో జేఈఈ, నీట్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ కావటానికి మెటీరియల్ పొందుపరిచామన్నారు. సమావేశంలో నూతనంగా 20 మంది పీటీసీ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, ఏకే బసవరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



నందికొట్కూరు జగనన్న కాలనీలో లబ్ధిదారుడు నిర్మించుకున్న ఇల్లు



నందికొట్కూరు సమీపంలోని ఒకటవ జగనన్న కాలనీలో శరవేగంగా సాగుతున్న గృహ నిర్మాణాలు

ఇల్లంతా ఆనందం

పేదోడి సొంతింటి కల సాకారం

- జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల గృహ ప్రవేశాలు
- జిల్లాలో 51,144 మందికి గృహాలు మంజూరు
- నిర్మాణ దశలో 29,584 ఇళ్లు
- పూర్తయిన గృహాలు 16,791
- లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు రూ.385.64 కోట్లు

ఏళ్ల తరబడి సొంతింటి కలలు కంటున్న పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహయోగం కల్పించారు. స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి అండగా నిలవడంతో ఊరూరా జగనన్న కాలనీలు చకచకా రూపుదిద్దుకుంటున్నాయి. పల్లె పక్కనే కొత్త ఊర్లు వెలుస్తున్నాయి. ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని లబ్ధిదారులు ఆనందంగా బంధుమిత్ర సమేతంగా గృహ ప్రవేశం చేస్తున్నారు.

నందికొట్కూరు: నిన్నటి వరకు అద్దె ఇళ్లు, పూరి గుడిసెల్లో నివాసమున్న పేదలు సొంతింటికి చేరువవుతున్నారు. నవరత్నాల్లో అర్హులందరికీ పక్కా ఇల్లు పథకం కింద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చే దిశగా చురుగ్గా అడుగులు పడుతున్నాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 269 జగనన్న లే అవుట్లలో 51,144 వేల మందికి ఇళ్ల స్థలాల మంజూరయ్యాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 29,584 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా 16,731 పూర్తయయ్యాయి. బేస్ లెవెల్ 9,495, రూఫు లెవెల్ 2,393, రూఫ్ క్యాస్ట్ (మెత్తు) లెవల్‌కు 965 ఇళ్ల నిర్మాణాలు వచ్చాయి. మిగిలినవి ప్రారంభ దశలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించిన లబ్ధిదారుల ఖాతాల్లో రూ.385,64,53,449 ప్రభుత్వం జమ చేసింది. అలాగే రూ.30.30 కోట్ల విలువ గల మెటీరియల్ ప్రభుత్వం సరఫరా చేసింది. పొదుపులక్ష్మి గ్రూపులోని సభ్యులకు బ్యాంకు ద్వారా ఇళ్ల నిర్మాణం ప్రారంభించేందుకు పొదుపు గ్రూపు సభ్యులకు రూ.35 వేలు పావలా వడ్డీకే రుణం ఇప్పిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేస్తున్నారు.


సబ్సిడీపై సామగ్రి సరఫరా..

గృహ నిర్మాణాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై సామగ్రిని సరఫరా చేస్తోంది. ఒక్కో లబ్ధిదారుడికి మొత్తం 90 బస్తాల సిమెంట్ మార్కెట్ ధర కంటే అతి తక్కువ ధరకు ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో బస్తా సిమెంట్ ధర రూ.380 పలుకుతుంటే రూ. 235లకే సరఫరా చేస్తోంది. అలాగే ఒక్కో లబ్ధిదారుడికి 500 కిలోల నాణ్యమైన ఐరన్‌ను మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరకు అందజేస్తోంది. ఇసుక 20 మెట్రిక్ టన్నుల వరకు ఉచితంగా ఇస్తోంది. వీటితో పాటు ఐఎస్ఐ మార్కు కలిగిన 10 రకాల నిర్మాణ సామగ్రిని మార్కెట్ ధరకే అందజేస్తోంది. వీటిని లబ్ధిదారుల ఇష్టాన్ని బట్టి కొనుగోలు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

జిల్లా వ్యాప్తంగా గృహాల మంజూరు

నియోజకవర్గం	గృహాలు
నందికొట్కూరు	5,738
ఆళ్లగడ్డ	9,700
బనగానపల్లె	9,350
డోన్	11,490
నంద్యాల	5, 552
శ్రీశైలం	10,678
పాణ్యం (గడివేముల, పాణ్యం మండలాలు)	1,980

మౌలిక వసతులు కల్పిస్తాం



జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 16,791 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈనెల 15వ తేదీలోపు మరో 12,853 ఇళ్లు పూర్తి చేసేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చే నిధులకు అదనంగా డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా ఒక్కో ఇంటికి రూ. 35 వేలు రుణంగా ఇప్పిస్తున్నాం. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.కోట్లు కేటాయించింది. దీంతో తాగునీరు, అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.
- మాధవరావు, హౌసింగ్ పీడీ

రూ.10 లక్షల ఆస్తి జగనన్న పుణ్యమే..



గతంలో ఏ ప్రభుత్వం కనీసం స్థలం కూడా మంజూరు చేయలేదు. అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చింది. కూడబెట్టిన కొంత సొమ్ము కలిపి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. గత నెలలో గృహ ప్రవేశం చేశాం. సీఎం వైఎస్ జగనన్న పుణ్యమా అని నా పేరు మీద రూ.10 లక్షల ఆస్తి నిలిచింది.
- లీలావతి, బైపాస్ రోడ్డు, నందికొట్కూరు

చాలా సంతోషంగా ఉంది



మేము 25 ఏళ్ల పాటు అద్దె ఇంట్లో జీవనం సాగించాం. నందికొట్కూరు పట్టణ సమీపంలో జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలం, పక్కా గృహం మంజూరయ్యాయి. వెంటనే పనులు పూర్తి చేసి గృహప్రవేశం కూడా చేశాం. అద్దె ఇళ్లల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. సొంతింటికి రావడం చాలా ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగనన్న చొరవతో మాకు అద్దె ఇంటి కష్టాలు తప్పాయి. - అమీనాబీ, నందికొట్కూరు

ఉగాది పండగ ఎప్పటికీ గుర్తు



మేము అల్లూరు రోడ్డు చాకలిపేటలో దాదాపు 15 ఏళ్లగా అద్దె ఇంట్లో ఉన్నాం. వ్యవసాయ కూలి పనులకు వెళ్లి సంపాదించిన దాంట్లో ప్రతి నెల అద్దె చెల్లించాం. ఇప్పుడు ఆ బాధ తీరింది. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని ఈ ఏడాది ఉగాది పండగ రోజు గృహ ప్రవేశం చేశాం. మేము ముస్లింలు అయినప్పటికీ ఉగాది మాకు ఎప్పటికీ గుర్తుంటుంది. - షేక్ షేకూన్‌బీ నందికొట్కూరు



పాములపాడు మండలం బానకచర్లలో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



డోన్ మండలం ఆవులదొడ్డిలో బైక్‌కు 'మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్' అతికించుకున్న దృశ్యం

ఇంటింటికీ జగనన్న నమ్మకం

- రెండో రోజూ అదే జోరు

'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జిల్లాలో రెండో రోజు శనివారం కొనసాగింది. వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటున్నారు. ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్నారు.

415 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల(సిటీ): జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 415 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 125 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిషు పరీక్షకు సంబంధించి జిల్లాలో 22,628 మంది విద్యార్థులకు గాను 22,213 మంది హాజరయ్యారు. పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించారు. డీఈఓ అనురాధ 9 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గోపాల్ 4 కేంద్రాలను, 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల అధికారులు 24 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించారు.

ఓపెన్ పరీక్షలకు 190 మంది గైర్హాజరు..

జిల్లాలో జరుగుతున్న ఓపెన్ పరీక్షలకు 190 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ అనురాధ శనివారం తెలిపారు. ఓపెన్ పదవ తరగతికి సంబంధించి ఆరు పరీక్ష కేంద్రాల్లో 849 మందికి గాను 769 మంది హాజరుకాగా 80 మంది గైర్హాజరాయ్యారన్నారు. అదేవిధంగా ఓపెన్ ఇంటర్‌కు సంబంధించి 8 పరీక్ష కేంద్రాల్లో 1,356 మందికి గాను 1,246 హాజరు కాగా 110 మంది గైర్హాజరయ్యారన్నారు.



ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ముస్లిం పెద్దలు

బనగానపల్లె పట్టణంలోని లాల్‌మసీద్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్ష పాటించడంతో ఎంతో పుణ్యం వస్తుందని, పేదలకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. అనంతరం ఎంఐఎం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమ్మబా స్వగృహంలో ఏర్పాటు చేసిన విందులో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రామిరెడ్డితో పాటు హిందూ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.
- బనగానపల్లెరూరల్



హోమగుండంలో పూజా ద్రవ్యాలు వేస్తున్న వేదపండితులు



ఉత్సవంలో పాల్గొన్న ఉభయదారులు

వైభవంగా స్వాతి వేడుకలు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం స్వాతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాముల ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన ద్వారం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూర్ణాహుతితో కార్యాక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పంచమఠాల ప్రాంగణంలో కౌమారిదేవి ఆలయం

- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలోని పంచమఠాల ప్రాంగణంలో కౌమారిదేవి అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శనివారం శ్రీశైలం చేరుకున్న మంత్రి.. ఈఓ లవన్నతో కలసి క్షేత్ర పరిధిలో పలు ప్రాంతాలను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులందరూ స్వామిఅమ్మవార్ల ప్రభోత్సవం, రథోత్సవం, గ్రామోత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఆలయ తూర్పు భాగంలోని ప్రధాన రహదారిపై గ్యాలరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ రహదారిలో ఇరువైపులా సుందరీకరణ మొక్కలతో పచ్చదనాన్ని పెంపొందించి ఆధ్యాత్మికత ఉట్టి పడేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదించిన ఆలయ దక్షిణ మాఢవీధులను పరిశీలించి సుందరీకరణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఏనుగుల చెరువు కట్ట ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పంచమఠాల ప్రాంగణంలో బిల్వం, కదంబం తదితర దేవతావృక్షాలను పెంచాలన్నారు. మఠాల ప్రాశస్త్యం భక్తులందరికీ తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి వెంట దేవస్థానం ఏఈఓ శ్రీనివాసరెడ్డి, డీఈఈ నరసింహారెడ్డి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు అయ్యన్న, రవికుమార్, సహాయస్థపతి జవహర్‌లాల్ ఉన్నారు.



గ్యాలరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యనారాయణ

కర్నూలు జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్

కర్నూలు: జిల్లా నూతన ఎస్పీగా జి.కృష్ణకాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆక్టోపస్ విభాగానికి బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది ఐపీఎస్‌లకు స్థానం చలనం కలిగించగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాకు ఈయన 55వ ఎస్పీ కాగా.. విభజన జరిగి ఏడాది గడచిన నేపథ్యంలో కర్నూలు జిల్లాకు మూడో ఎస్పీ. అనంతపురం జిల్లా గుత్తి మండలం దొండపాడుకు చెందిన ఈయన 2017లో ఐపీఎస్ హోదాలో పోలీసు శాఖలో చేరారు.

నిరాదరణ పిల్లలకు మిషన్ వాత్సల్యం



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు
- ఒక్కొక్కరికి నెలకు రూ. 4 వేలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 412 మంది చిన్నారుల గుర్తింపు
- ఇప్పటికే 279 మందికి పథకం వర్తింపు
- ఈ నెల 15 వరకు దరఖాస్తుకు గడువు

కోవెలకుంట్ల: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు, నిస్సహాయ స్థితిలో ఉన్న బాలబాలికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొండంత అండగా నిలిచాయి. 18 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న బాలబాలికలకు విద్య, ఆరోగ్యం, సంతోషకరమైన జీవితంతో పాటు ఆర్థిక భరోసా కల్పించేందుకు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఈ పథకానికి అర్హులైన విద్యార్థిని, విద్యార్థులకు నెలకు రూ. 4 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 412 మంది బాలబాలికలను గుర్తించారు. వీరిలో ఇప్పటికే 279 మంది విద్యార్థులకు పథకం అందుతుండగా మిగిలిన విద్యార్థులకు వర్తింప చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీరితోపాటు కోవిడ్-19, రోడ్డు ప్రమాదం, ఇతర కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, పాక్షిక అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయి ఉంటే), భార్య, భర్త విడాకులు తీసుకుని నిరాదరణ పొందిన పిల్లలు, ఇతర అనాథలు, యాచకులు, తదితర వర్గాలకు చెందిన పిల్లలను గుర్తించేందుకు ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సర్వే నిర్వహిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. విద్యార్థులకు అందించే నాలుగు వేల రూపాయాల్లో కేంద్రం వాటా రూ. 2,400 (60శాతం) కాగా, మిగిలిన రూ. 1600(40)శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ పథకం వల్ల నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల పిల్లల సంరక్షణతో పాటు వారి చదువును నిరాటంకంగా కొనసాగించేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగ పడతాయి.

దరఖాస్తు విధానం, పరిశీలన..

గ్రామాల్లో తల్లిదండ్రులు లేని 18 సంవత్సరాల్లోపు విద్యార్థినీ, విద్యార్థులను గ్రామ మహిళా కార్యదర్శి లేదా అంగన్‌వాడీ కార్యకర్త లేదా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతరుల ద్వారా గుర్తించి ఆ బాలల వివరాలు, కుటుంబ నేపథ్యం, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య స్థితిగతులు, విద్యను కొనసాగించు వివరాలను తెలియపరుస్తూ ఉన్న దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలి. అందిన దరఖాస్తులను మండలస్థాయి స్క్రూటిని కమిటీ(తహసీల్దార్/ఎంపీడీఓ/ఎంఈఓ/సీడీపీఓ/ సూపర్‌వైజర్లు) ఆధ్వర్యంలో నిశితంగా పరిశీలిస్తారు. అర్హత కలిగి ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులందరూ సంతకాలు చేసిన తర్వాత కర్నూలులోని బాలల పరిరక్షణ విభాగం కార్యాలయానికి పంపిస్తారు.



కోవెలకుంట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

అర్హులు ఎవరంటే..

- తల్లి వితంతు లేదా విడాకులు తీసుకుని తండ్రి కుటుంబాన్ని విడిచి పెట్టిన పిల్లలు
- తల్లిదండ్రులను కోల్పోయి ఇతర కుటుంబాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు
- తల్లిదండ్రులు బాగా ఆర్థికంగా వెనుకబడి శారీరకంగా అసమర్థులై పిల్లలను పెంచలేని స్థితిలో ఉన్న వారి పిల్లలు
- జువైనల్ జస్టిస్ చట్టం-2015 ప్రకారం గుర్తించిన బాలకార్మికులు, ఇంటి నుంచి పారిపోయిన బాల యాచకులు, పునరావాసం కోసం ఎదురు చూసే బాలికలు
- కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన బాలబాలికలు
- హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు
- దివ్యాంగులు, హింస, దోపిడికి గురవుతున్న పిల్లలు
- సీఎం కేర్‌ఫర్ చిల్డ్రన్‌పథకంలో లబ్ధిపొందుతున్న చిన్నారులు
- గ్రామాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ. 72 వేల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 96వేల లోపు మించని వారి పిల్లలు కూడా అర్హులు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు..

- తల్లి లేదా తండ్రి చనిపోయి ఉంటే మరణ ధృవీకరణ పత్రాలు
- భార్య, భర్తలు విడాకులు పొంది విడిగా ఉన్నట్లు అయితే వీఆర్‌ఓ నుంచి సర్టిఫికెట్
- తల్లిదండ్రులు, పిల్లల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు
- పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు
- విద్యార్థి స్టడీ సర్టిఫికెట్ (ప్రస్తుతం స్కూల్‌లో చదువుతున్నది)
- తల్లి, తండ్రి, సంరక్షకుడితో పాటు పిల్లలతో జాయింట్ అకౌంట్ లేదా పిల్లల పేరును ఖాతా ఉన్న చెల్లుబాటు అవుతుంది.
- ఇద్దరు పిల్లలు ఉంటే రెండు ఖాతాలు ఉండాలి
- ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకోవాలి
- పూర్తి చేసిన దరఖాస్తుఫారాలకు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జత చేసి ఈ నెల 15వ తేదీలోపు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేయాలి.

మిషన్ వాత్సల్యను సద్వినియోగం చేసుకోండి



అనాథ పిల్లలను అన్ని విధాలా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్‌వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకానికి అర్హులైన పిల్లలకు నెలకు రూ. 4 వేల చొప్పున అందజేస్తారు. కోవెలకుంట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆయా గ్రామాల్లో అలాంటి పిల్లలను గుర్తించి పథకం వర్తింపజేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు తీసుకుంటున్నారు.

– పద్మావతి, ఏసీడీపీఓ, కోవెలకుంట్ల

ఇద్దరు పిల్లల భవిష్యత్‌కు ఆసరా



కరోనా వైరస్‌తో నా భర్త మునిరంగడు 2021లో మృతి చెందాడు. ప్రస్తుతం కుమారుడు 7వ తరగతి, కుమార్తె 4వ తరగతి చదువుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న వాత్సల్య పథకం పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఆసరాగా ఉంటుంది. పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు డబ్బులు ఉపయోగపడతాయి.

– ఉమాదేవి, కోవెలకుంట్ల

అనాథ పిల్లలను గుర్తిస్తున్నాం



తల్లిదండ్రులను కోల్పోయి 18 సంవత్సరాల్లోపు వయసు ఉండి చదువుకుంటున్న పిల్లలను గుర్తిస్తున్నాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథక ప్రాముఖ్యతను వివరిస్తున్నాం. మా అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో ఇప్పటికే ముగ్గురి పిల్లలను గుర్తించి పథకం వర్తింపుకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నాము.

– వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, కోవెలకుంట్ల

అప్పుల బాధ తాళలేక..



మృతి చెందిన దండగల శివుడు (ఫైల్)

బేతంచెర్ల: సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ వివరాల మేరకు.. సిమెంట్ నగర్ గ్రామంలోని లాంఢ్రి కొట్టాలకు చెందిన వడ్డె దండగల శివుడు(34) భార్య పార్వతి కొంత కాలం క్రితం ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూలీకి వెళ్లి కుటుంబాన్ని పోషించే శివుడు రెండు సార్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వైద్యం, కుటుంబ పోషణకు రూ. 3 లక్షల వరకు అప్పు చేశాడు. భార్య చనిపోవడం, అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. దీంతో శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి బీసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లెకు తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గుండెపోటుతో ఎస్‌ఐ మౌలి బాషా మృతి



మౌలి బాషా(ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న దూదేకుల మౌలి బాషా(60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన ఈయన 1987లో బేతంచెర్లలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. అప్పటి నుంచి హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. 2021 నుంచి నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మౌలిబాషా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో కుటుంబీకులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకొని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం మౌలిబాషా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చాడు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ముంజ చల్లన.. వ్యాపారం తియ్యన



ఆటోల్లో, మోటార్ సైకిళ్లపై, తోపుడు బండ్ల మీద, నీడ నిచ్చే చెట్ల వద్ద తాటిముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఐస్ యాపిల్‌గా ఇవి పేరుగాంచాయి. శరీరానికి చలువ చేయడంతోపాటు అజీర్తిని తగ్గిస్తాయి. గుండె జబ్బులను దూరం చేస్తాయి. పారదర్శకంగా జెల్లీలా జారిపోయే వీటిని తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన రైతు నీలప్ప తన పొలం గట్టుమీద పెరిగిన తాటి చెట్ల నుంచి కాయలను తీసుకొచ్చి శనివారం బ్రహ్మగుండం దేవస్థానం వద్ద రహదారి పక్కన చెట్టునీడలో అమ్ముతూ కనిపించారు.

– వెల్దుర్తి

ఐదో విడత 1,427 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కర్నూలు: చోరీకి గురైన, ఎక్కడైనా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు వెతికిమరీ తెచ్చిస్తున్నారు. ఆరు నెలల వ్యవధిలో నాలుగు విడతలుగా రూ.12.05 కోట్లు విలువ చేసే 5,727 మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేశారు. దీంతో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా సెల్‌ఫోన్ రికవరీలో అగ్రగామిగా నిలిచింది. ఐదో విడత రూ.4.05 కోట్ల విలువ చేసే 1,427 సెల్‌ఫోన్లు రికవరీ చేసి శనివారం బాధితులకు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం మైదానంలో అందజేశారు. సౌదీ అరేబియా నుంచి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులైన నంద్యాల జిల్లాకు చెందిన బి.చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డికి అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఒడిశా, ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, బీహార్, రాజస్థాన్, తెలంగాణతో పాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి కూడా సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందించారు.

మొబైల్ పోగొట్టుకుంటే...

ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ లింక్‌లో www. kurnoolpolice.in మొబైల్ థెఫ్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లింక్ ఓపెన్ చేసి ఫిర్యాదు ఫారం నింపాలి. పేరు, జిల్లా, పోలీస్‌స్టేషన్ పరిధి, మొబైల్‌కు సంబంధించిన ఐఎంఈఐ-1, ఐఎంఈఐ-2 నెంబర్లతో పాటు బిల్లులు ఆన్‌లైన్‌లో సమాచారం పొందుపరిస్తే సాంకేతిక ఆధారంగా ట్రాకింగ్ చేసి ఎక్కడుందో గుర్తిస్తారు.

వడదెబ్బతో యువకుడి మృతి



శివరాముడు (ఫైల్)

మిడుతూరు: వీపనగండ్ల గ్రామంలో ఓ యువకుడు వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన చాకలి రామకృష్ణ, సావిత్రి దంపతుల మూడో కుమారుడు శివరాముడు (22) తర్తూరు జాతరలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలకు వరుసగా మూడు రోజులు వెళ్లి శుక్రవారం వడదెబ్బకు గురై అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

తాగిన మత్తులో కిందపడి వ్యక్తి మృతి

వెల్దుర్తి: మద్యం తాగిన మత్తులో కిందపడి కలుగొట్ల గ్రామానికి చెందిన ఎల్లరాజు(29) మృతిచెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎల్లరాజు గ్రామంలో వ్యవసాయం చేసేవాడు. డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకుని అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 5వ తేదీ బుధవారం మద్యం సేవించి గ్రామ సమీపంలోని రెడ్డిగారి చింతమాను రాళ్ల గుట్ట దగ్గర కింద పడి గాయపడ్డాడు. గమనించిన తమ్ముడు, తల్లి.. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ కోలుకోలేక శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

గుంతకల్లు రూరల్: కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం దంచర్ల గ్రామానికి చెందిన సుంకన్న, సుంకమ్మ దంపతుల కుమారుడు రంగస్వామికి ఏడేళ్ల క్రితం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన లక్ష్మి(27)తో వివాహమైంది. ప్రస్తుతం వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భర్త, అత్తమామల వేధింపులు అధికమవడంతో లక్ష్మి పూర్తిగా విసిగిపోయింది. శుక్రవారం పురుగు మందు తాగడంతో కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక శనివారం తెల్లవారుజా మున మరణించింది. కేసు నమోదు చేసినట్లు గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.